కబ్జా కోరల్లో మూసీ

- మట్టితో నదిని నింపేస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



మూసీ నది బఫర్ జోన్ పరిధిలో చేపడుతున్న జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

నాగోలు: గతంలో నగర వాసుల దాహార్తిని తీర్చిన మూసీనది నేడు మురికికూపంగా మారి, కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని కనుమరుగవుతోంది. ఒక వైపు కోట్ల రూపాయలు వెచ్చించి నది పరీవాహక ప్రాంతాలను సుందరీకరిస్తుండగా...., మరో వైపు ఆక్రమణదారులు మూసీని మింగేస్తున్నారు. మూసీని పరిరక్షించాల్సిన జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా మూసీ వెంబడి ఉన్న స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- దిల్‌సుఖ్‌నగర్ గణేష్‌పురి కాలనీ నుంచి నాగోలు వరకు మూసీ నది ఆక్రమణలతో ఇప్పటికే చాలాచోట్ల స్వరూపం కోల్పోయింది.
- నదిలో మట్టిని నింపి ఆక్రమిస్తున్నారు. అక్కడ బస్తీలు,
- కాలనీలు రావడంతో పాటు పెద్ద భవంతులు వెలిశాయి.
- ఈ నేపథ్యంలో ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు చర్యలు చేపట్టింది. మూసీ రివర్ ఫ్రండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌గా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని నియమించింది.
- బాపూఘాట్ నుంచి నాగోలు వరకు సుందరీకరణ పనులు చేపట్టింది. మూసీ ఇరువైపులా వాకింగ్ ట్రాక్‌లు నిర్మించేందుకు మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధి శ్రీకారం చుట్టారు.
- నాగోలు బ్రిడ్జి సమీపంలో మూసీ రెండు వైపులా వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూసీ కబ్జా గురికాకుండా బఫర్ జోన్‌ను కొత్త మేరకు నిర్ధారించారు.



కొత్తపేట న్యూమారుతీనగర్
మూసీ బఫర్ జోన్‌లో నిర్మించిన ఇళ్లు

- అయినా ఆక్రమణలు ఆగడం లేదు. కొత్తపేట, చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఫణిగిరి కాలనీ, ఇందిరానగర్, న్యూమారుతీనగర్, మారుతి నగర్, సత్యానగర్, సమతాపురి కాలనీలో మూసీ నది చుట్టు పక్కల స్థలంలో మట్టిపోసి చదును చేసి షెడ్లు నిర్మిస్తున్నారు.
- రాత్రికి రాత్రే నిర్మాణ వ్యర్థాలను తెచ్చి నదిలో డంప్ చేస్తున్నారు. ఆ తర్వాత చదును చేసి షెడ్లు నిర్మించడం, లేదా పార్కింగ్ ప్రదేశాలుగా వినియోగిస్తున్నారు.
- కొత్తపేట ఫణిగిరి కాలనీలో స్థానిక నాయకుడు ఒకరు మూసీ స్థలాన్ని కబ్జా చేసి సమీప కాలనీల డ్రైనేజీ అక్కడ నుంచి పోకుండా చేశాడు. దీంతో కాలనీ వాసులు డ్రైనేజీ దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.
- మూసీ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని స్థానిక కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి మూసీ నదికి హద్దులు గుర్తించి, కబ్జాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు



మూసీ నది కబ్జా కాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మూసీ పరిరక్షణకు ప్రభుత్వం బఫర్ జోన్ హద్దులు గుర్తించింది. బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణలు చేపడితే అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు.

– సుధీర్‌రెడ్డి, మూసీ రివర్ ఫ్రండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



కొత్తపేట, చైతన్యపురి పరిధి మూసీ పరీవాహక ప్రాంతంలో కొందరు మూసీలో మట్టిని నింపి కబ్జా చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మూసీ నది కబ్జాకాకుండా కాపాడాలి.

– ఎం. నరేందర్‌రెడ్డి , ఫణిగిరి కాలనీ వాసి

కబ్జా చేసి షెడ్లు నిర్మాణం



కబ్జాదారులు రాత్రికి రాత్రే నిర్మాణ వ్యర్థాలను తెచ్చి కొత్తపేట నుంచి నాగోలు వరకు మూసీ వెంబడి డంప్ చేస్తున్నారు. ఆ తర్వాత చదును చేసి షెడ్లు నిర్మిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాలు, షటిల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

–కేవీ స్వామి, కొత్తపేట

క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 13, వంకాయ 23, బెండ 50, పచ్చి మిర్చి 40, కాకర 32, బీర 45, క్యాబేజీ 9, ఫ్రెంచిబీన్స్ 35, క్యారెట్ 19, దొండ 25–32, చిక్కుడు 50, గోకర 37, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 21, దోస 23, సొర 11, పొట్ల 13, ఉల్లి 18. చామగడ్డ 68. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

'ఆరోగ్యం పూర్తిగా క్షీణించాకే ఆస్పత్రిలో చేర్పించారు'

మన్సురాబాద్: సూర్యాపేటకు చెందిన శివకుమార్ (35) ఆరోగ్యం పూర్తిగా క్షీణించి అపస్మారక స్థితికి చేరిన తర్వాతే అతని బంధువులు ఎల్‌బీనగర్ కామినేని ఆసుపత్రిలో చేర్పించారని, వైద్యులు మెరుగైన వైద్యం చేసినప్పటికీ శివకుమార్ మృతి చెందాడని ఆసుపత్రి మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ జయకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శివకుమార్‌కు తీవ్రస్థాయిలో గుండె పోటు రావటం వల్లే ఛాతి బిగుతుగా మారి చికిత్సకు సహకరించలేదన్నారు. శివకుమార్ ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు అతని బంధువులతో చర్చించామని తెలిపారు. శివకుమార్‌కు వైద్యసేవలు అందించటంలో వైద్యుల నిర్లక్ష్యం గానీ, బిల్లుల చెల్లింపులో ఒత్తిడి తేవటం గానీ చేయలేదని స్పష్టం చేశారు.

బాధ్యతల స్వీకరణ



ఏసీపీ వెంకటరమణ నుంచి బాధ్యతలు స్వీకరించిన శ్యాంసుందర్

సైదాబాద్: మలక్‌పేట నూతన ఏసీపీగా జి.శ్యాంసుందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐడీ విభాగంలో డీఎస్పీగా పనిచేసిన ఆయన ఇటీవల డీజీపీ జరిపిన బదిలీల్లో మలక్‌పేట ఏసీపీగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా పనిచేస్తున్న వెంకటరమణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఏసీపీ వెంకటరమణ డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు.

డ్వాబ్ సంస్థతో కె.విశ్వనాథ్‌కు విడదీయరాని బంధం



డ్వాబ్ సంస్థ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన విశ్వనాథ్ (ఫైల్)

చాదర్‌ఘాట్: డ్వాబ్ సంస్థతో కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు విడదీయరాని బంధం ఉండేదని సంస్థ చైర్మన్ పానుగోటి చొక్కారావు అన్నారు. శుక్రవారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ.. అంధులను దృష్టిలో ఉంచుకునే కె.విశ్వనాథ్ సిరివెన్నెల చిత్రాన్ని తెరకెక్కించారన్నారు. డ్వాబ్ సంస్థ వెబ్‌సైట్‌ను ఆయనే ప్రారంభించారని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సమావేశంలో సంస్థ సభ్యుడు పరమేశ్ పాల్గొన్నారు.

ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న డీసీ జయంత్, కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ సూచించారు. శుక్రవారం ఆయన సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డితో కలిసి రెవెన్యూ బోర్డు కాలనీ పార్క్‌లో నిర్వహించిన అవగాహన కార్యాక్రమంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భోగస్ ఓట్లు తొలగించడానికి, ఎన్నికలు సజావుగా పారదర్శకంగా జరగడానికి ఈ అనుసంధానం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంత్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, భక్తవత్సలం, వరప్రసాద్, గోవింద్‌రాజు, కృష్ణారావు పాల్గొన్నారు.

రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాండు

నాగోలు: తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నిట్టు పాండు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్‌గౌడ్ శుక్రవారం నియామకపత్రం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం తగదు



శిలాఫలకానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

హయత్‌నగర్: మన ఊరు– మన బడి అంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం సర్కార్ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదులు నిర్మించేందుకు శిలాఫలకం వేసి నాలుగేళ్లైనా నిర్మాణం చేపట్టలేదని శుక్రవారం బీజేపీ నాయకులు శిలాఫలకానికి పాలాభిషేకం చేశారు. తరగతి గదులు లేక విద్యార్థులు చెట్ల కింద కూర్చుంటూ చదువుకుంటున్నారని, అదనపు గదులు నిర్మిస్తామని నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు పనులు చేపట్టక పోవడ సిగ్గుచేటన్నారు. గతంలో చేపట్టిన పనులకు దిక్కు లేదుగానీ ..మన ఊరు మన బడి అంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. శంకుస్థాపన చేసిన గదుల నిర్మాణం వెంటనే చేపట్టకపోతే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, గోవిందాచారి, గంగని శ్రీను, సంఘి అశోక్, యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

'పది' పరీక్షల వరకు ఉపాధ్యాయ బదిలీలు వద్దు



వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధి షేక్ మహమూద్

సైదాబాద్: పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు ఉపాధ్యాయ బదిలీలు నిలిపివేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండల కన్వీనర్ షేక్ మహమూద్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ప్రతినిధులతో కలిసి సైదాబాద్ విద్యాశాఖాధికారి రాధాకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోవిడ్ కారణంగా రెండేళ్ల నుంచి విద్యార్థులు చదువులో వెనుక పడ్డారాన్నారు. పూర్తిస్థాయిలో పాఠ్యాంశాల బోధన జరుగుతున్న ప్రస్తుత సమయంలో ఉపాధ్యాయుల బదిలీలు జరిగితే అది విద్యార్థుల సామర్థ్యాలపై ప్రభావం చూపిస్తుందన్నారు. పదో తరగతి విద్యార్థులు కళాశాల విద్యలో ఇబ్బందులు పడకుండా ఉండటానికి వారికి వార్షిక పరీక్షలు పూర్తయ్యే వరకు బదిలీలు నిలిపివేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కృష్ణగౌడ్, మహేష్, సాయిలక్ష్మి, యశోద, ప్రమీల పాల్గొన్నారు.

ఎంటమాలజిస్ట్ గంగప్ప మాతృ సంస్థకు సరెండర్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ సీనియర్ ఎంటమాలజిస్ట్ గంగప్పపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. జనవరి నెలలో ఫాగింగ్ మాటున పెట్రోల్, డీజిల్ స్వాహా, దోమల మాటున విధులకు దూరంగా ఉన్నా హాజరైనట్లు రికార్డులు నమోదు చేసి 30 మంది వేతనాలు కాజేసిన వైనంపై వరుస కథనాలు రావడంతో అధికారులు గంగప్పపై విచారణ చేపట్టారు. ఈ విచారణలో నిధులు, డీజిల్ స్వాహా నిజమేనని తేలడంతో గంగప్పను మాతృ సంస్థ అయిన వైద్య ఆరోగ్య శాఖకు సరెండర్ చేస్తూ జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గంగప్ప స్థానంలో ఖైరతాబాద్ జోన్‌లో సీనియర్ ఎంటామాలజిస్ట్‌గా పని చేస్తున్న రజినీనిఎల్‌బీనగర్ జోనల్ ఇన్‌చార్జ్ సీనియర్ ఎంటామాలజిస్ట్‌గా నియమించారు. ఆమె శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చాదర్‌ఘాట్: దివ్యాంగుల హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి తెలిపారు. శుక్రవారం పలువురు దివ్యాంగులు హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు తెలుపుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన వాసుదేవరెడ్డి జిల్లా సంక్షేమశాఖ అధికారి మోతితో ఫోన్‌లో వారి సమస్యలు వివరించారు. హాస్టళ్లలోని చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా పరిధిలోని హాస్టళ్ల వార్డెన్‌లు, ఆయా హాస్టళ్ల నుంచి ఐదుగురు విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేస్తే తాను, శాఖ డైరెక్టర్‌తో కలిసి పాల్గొంటామని సూచించారు. తద్వారా సమస్యలు పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, బాబురావు, వెంకట్‌రెడ్డి, నర్సింహులు రాజేశ్వరి, రత్న పాల్గొన్నారు.



చైర్మన్ వాసుదేవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

రజకులకు రూ.250 కోట్లు కేటాయించాలి


నాగోలు: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రజకులకు రూ. 250 కోట్ల నిధులు కేటాయించాలని రజక సంఘం జాతీయ కో ఆర్డినేటర్ కొల్లూరు మల్లేష్, రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల ఉప్పలయ్య, మన రజక సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పెద్దపూరే బ్రహ్మయ్య ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శుక్రవారం నాగోలు సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లడుతూ, రాష్ట్ర బడ్జెట్‌లో రజకులకు రూ. 250 కోట్లు కేటాయించాలన్నారు. రజకులను ఎస్సీలో చేర్చే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేయాలి కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో ధోబి పోస్టులు రజకులకు కేటాయించాలి, ఎస్సీ, ఎస్టీల మాదిరిగా రజకులకు అట్రాసిటీ చట్టాన్ని వర్తింపజేయాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వెంకట్ రాములు, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి గోవింద్ మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ పగడాల వెంకటేష్, యూత్ అధ్యక్షుడు పగడాల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు పగిళ్ల వెంకటేష్, ఎల్‌బీనగర్ ఉపాధ్యక్షుడు ధూపాటి వీరన్న, మడివేలు వెంకటయ్య,రాజు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని మోసం

ముగ్గురిపై కేసు నమోదు

చంచల్‌గూడ: డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన ముగ్గురిపై మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. వివరాల్లోకి వెళితే.. కుర్మగూడ డివిజన్ వినాయక్‌నగర్‌లో నివసించే కూరగాయల వ్యాపారి చంద్రశేఖర్ (47)కు తన స్నేహితులు బైరామల్‌గూడకు చెందిన కుమార్, రాజు చావణీలో డబుల్ బెడ్‌రూమ్‌లు ఇప్పిస్తామని నమ్మబలికారు. 2021లో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఏజీ కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగి బాలరాజును పరిచయం చేసి అతను చాలా మందికి డబుల్ బెడ్ రూమ్ ఇప్పించాడని రూ.2 లక్షల 20 వేలు తీసుకున్నారు. రెండేళ్లు గడిచినా ఇల్లు ఇప్పించకపోవడంతో ముగ్గురు కలిసి మోసం చేశారని బాధితుడు మాదన్నపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ చైతన్యపురి అధ్యక్షుడిగా పర్ల శివకుమార్



చైతన్యపురి: లయన్స్ క్లబ్ ఆఫ్ చైతన్యపురి అధ్యక్షుడిగా పర్ల శివకుమార్ నాయుడు నియమితులయ్యారు. దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన సమావేశంలో డిస్ట్రిక్ట్ బి.20ఏ గవర్నర్ లయన్ జూలూరి రాజు, సెకెండ్ గవర్నర్ డి.కోటేశ్వరరావులు ఈమేరకు శివకుమార్‌కు నియామక పత్రం అందజేశారు. అలాగే ట్రెజరర్‌గా రాంమోహన్‌ను నియమించారు. కార్యక్రమంలో రీజనల్ చైర్ పర్సన్ టి. అంజయ్య, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ కాచం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, ఎంఆర్‌డీసీ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, పలు విభాగాల అధికారులు, దివ్యాంగులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యలపై మానవత్వంతో, మనస్సుతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల్లో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంలో 5 శాతం కేటాయించడమే కాకుండా వారికి మొదటి అంతస్తులోనే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, పార్కుల్లోకి వీల్ చైర్స్‌తో వెళ్లడానికి ర్యాంపులు ఏర్పాటు చేయించాలని అధికారులకు సూచించారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారుల వద్దకు దివ్యాంగులు ఏదైనా సమస్యతో వస్తే సానుభూతి చూపడం కాకుండా సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్, జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, మోతి, కందుకూరు ఆర్‌డీఓ సూరజ్, సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు గంగారాం, నాగభూషణం, నాగరాజు, నర్సింహారెడ్డి, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'హాత్ సే హాత్ జోడో'యాత్ర విజయవంతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జక్కిడి ప్రభాకర్ రెడ్డి

లింగోజిగూడ: హాత్ సే హాత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ పిలుపునిచ్చారు. ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న హాత్ సే హాత్ జోడో యాత్ర విజయవంతం కోసం గురువారం రాత్రి కర్మన్‌ఘాట్‌లో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభాకర్ రెడ్డి, జితేందర్ మాట్లాడుతూ, స్థానికులకే ఎల్‌బీనగర్ టికెట్ కేటాయించాలని, స్థానికుల్లో ఎవరికి ఇచ్చినా కలిసి కట్టుగా పని పార్టీని గెలిపిస్తామన్నారు. గత 30 ఏళ్లుగా వ్యాపారాలు, కుటుంబాన్ని వదిలి, ఆస్తులను అమ్ముకొని పార్టీ కోసం కష్టపడుతున్నామన్నారు. ఎల్‌బీనగర్ నుంచి సుధీర్‌రెడ్డిని తరమి కొట్టేది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు మల్లారపు శ్రీనివాస్, బుడ్డ సత్యనారాయణ, శశిధర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నాయకులు వింజమూరి రాఘవాచారి, సామ మహేశ్వర రెడ్డి, రామకృష్ణరెడ్డి, రాజేశ్వరి, రజిని, వసంత తదిరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నాగోలు: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 11న జరిగే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాగోలు డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి పిలుపునిచ్చారు. శుక్రవారం నాగోలు డివిజన్ బండ్లగూడలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మెగా జాబ్ మేళా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద జాబ్‌మేళా అని, ఇందులో దాదాపు 108 కంపెనీలు (టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటీ నాన్ ఐటీ) కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఏడో తరగతి నుంచి పీజీ చదువుకున్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో వికలాంగులు, మూగ, చెవిటి, అంధులకు, ట్రాన్స్ జెండర్స్ కూడా తమ పేర్లు నమోదు చుసుకోచ్చన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కట్ట ఈశ్వరయ్యాగౌడ్, భాస్కర్‌గౌడ్, శ్యామ్ సుందర్‌రెడ్డి, చంద్రశేఖర్ ఆజాద్, రంగేశ్వరి, శిల్పారెడ్డి, కవిత, కవేరి, యాదయ్య, చెర్కు జంగయ్య, భాస్కర్‌రెడ్డి, పోచయ్య పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీరయ్య

హయత్‌నగర్: ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, పూర్తైన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అర్హులకు కేటాయించాలని ఇళ్ల సాధన పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ స్కారి వీరయ్య డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ సీఐటీయూ, ఐద్వా, కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ... సీపీఎం, బీఆర్ఎస్ కలిసి పని చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాల నిమిత్తం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, అర్హులైన పేదలందరికీ ఇళ్లు సాధించడమే తమ పార్టీ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి నర్సింహ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, కేవీపీఎస్ జిల్లా నాయకులు కనకయ్య, సీఐటీయూ నాయకులు కృష్ణ, ఐద్వా నాయకురాలు సంధ్య, నాయకులు గోపి, రాణి, కవిత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

చైతన్యపురి: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. హనుమాన్‌నగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ ఏఈ పార్వతితో కలిసి పరిశీలించారు. నూతన రోడ్డు నిర్మాణం చేసే ముందు డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్‌ను వేయడం పూర్తయ్యేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఒకసారి రోడ్డు వేసని తరువాత తవ్వకాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ సిబ్బంది చూసుకోవాలన్నారు. కార్పొరేటర్ వెంట వాటర్‌వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, సీవరేజ్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, రెడ్డి జేఏసీ తెలంగాణ అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా



హనుమాన్ నగర్ వాసులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని కాలనీ అంతర్గత రోడ్లతో పాటు, బహిరంగ ప్రదేశాల్లో, ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెత్తా చెదారాన్ని వేస్తే సహించేది లేదని, అలాంటి వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో శుక్రవారం ఆమె కాలనీ వాసులతో కలిసి మార్నింగ్ వాక్ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతా నాయక్ మాట్లాడుతూ, ఖాళీ ప్లాట్లలో చెత్తవేయడం వల్ల దుర్వాసన రావడంతో పాటు చెత్తలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, కాలనీ ప్రతినిధులు రవీందర్ రెడ్డి, గంధం శ్రీనివాస్, కృష్ణగౌడ్, ప్రేమ్‌రాజ్ బాలునాయక్, చంద్రశేఖర్, సుదర్శన చారి తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు' లో అవకతవకలు లేకుండా చూడాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మలక్‌పేట: దళితబంధు పథకంలో అవకతవకలు లేకుండా చూడాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి గంట సుదర్శన్ మాదిగ అన్నారు. ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పిలుపు మేరకు శుక్రవారం మలక్‌పేట నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా కలెక్టర్ ద్వారా దళితులకు ఈ పథకం అందించే విధంగా చూడాలని కోరుతూ ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసి నిరుపేదలైన వారికి మొదటి ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రామకృష్ణ, వెంకన్న, కొమ్ము రాజు, భీమన్న, మహేష్, తదితరులు ఉన్నారు.